# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నేడు సిరిసిల్లలో దుస్తుల పరిశ్రమ ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రూ. 102 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక దుస్తుల పరిశ్రమను వ్యవసాయ, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబులు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, ఇతర అధికారులతో మంత్రులు సమీక్ష జరిపారు.బెంగళూరుకు చెందిన టెక్స్ పోర్ట్ ఇండస్ట్రీస్ రూ.40 కోట్లతో యంత్రాలను ఏర్పాటు చేసి పరిశ్రమను ఏర్పాటు చేసింది. అయితే పారిశ్రామిక షెడ్లు, విద్యుత్ సరఫరా లాంటి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇక్కడ రూపొందించిన దుస్తులను 'టెక్స్ పోర్ట్' వంద శాతం ఎగుమతి చేయనుంది. ఏటా రూ. 300 కోట్ల విలువైన దుస్తులను టామీ హిల్ఫిగర్, రాబర్ట్ గ్రాహం, వ్యాన్స్, మైఖేల్ కోర్స్ లాంటి అంతర్జాతీయ బ్రాండ్లకు సరఫరా చేయనుంది. ఏటా 70 లక్షల పీస్ లు తయారు అవుతున్న క్రమంలో తాజాగా ప్రస్తుతం వెయ్యి కుట్టు మిషన్లను ఏర్పాటు చేసి రెండు షిఫ్టుల్లో 1600 మంది మహిళలకు ఉపాధి కల్పించనున్నారు. మరో 3 ఏళ్లలో ఇంకో రెండు వేల మంది కి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. కాగా, ఈ ప్రారంభ కార్యక్రమం అనంతరం మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు ఉద్యోగాలు పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేస్తారు.

### హెచ్‌సీయూ భూములను
## సందర్శించిన సుప్రీంకోర్టు కమిటీ

- సర్వే నెం.25లోని కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అమ్మాలని భావించగా.. విద్యార్థులు ఆందోళనలు చేయడం, తీవ్ర వివాదం ఏర్పడిన విషయం తెలిసిందే. దాంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆ భూముల్లోకి వెళ్లి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఆయన సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించారు. దీంతో ఆ భూముల్లో చెట్లు నరకొద్దని ఆదేశించింది. భూముల అమ్మకం, చెట్ల నరికివేతపై స్టే విధించింది. ఈ క్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని సుప్రీంకోర్టు కమిటీ పరిశీలించింది. సర్వే నెంబర్ 25లోని కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించి వివరాలు సేకరించింది.

కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, సభ్యులు సీపీ గోయల్, సునీల్ లిమాయే, చంద్రదత్ దాదాపు గంటపాటు 400 ఎకరాల స్థలంలో కలియ తిరిగి అక్కడి పరిస్థితులను రికార్డు చేశారు. విద్యార్థులతోనూ కమిటీ సమావేశమైంది. విద్యార్థులు కంచ గచ్చిబౌలి భూముల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులను వివరిస్తూ రూపొందించిన నివేదికను కమిటీకి అందజేశారు.కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన అనంతరం సుప్రీంకోర్టు సాధికారక కమిటీ ఛైర్మన్, సభ్యులు తాజ్ కృష్ణా హొటల్‌కు వెళ్లారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జీఏడీ ముఖ్య కార్యదర్శి రఘునందన్, సీఎంవో కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జలమండలి ఎండీ, టీజీఐఐసీ ఎండీతో సమావేశమైంది. కంచ గచ్చిబౌలి భూములపై ప్రభుత్వ అధికారులతో కమిటీ చర్చించింది. అనంతరం కంచ గచ్చిబౌలి భూములపై కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఆ తర్వాత హెచ్‌సీయూ పాలకవర్గంతో సాధికారక కమిటీ ప్రత్యేక భేటీ అయింది. వరుస భేటీల అనంతరం సుప్రీంకోర్టు సాధికార కమిటీ పర్యటన ముగించుకుని ఢిల్లీ పయనమైంది.

# నా బ్రాండ్ యంగ్ ఇండియా

- ప్రతి నియోజకవర్గంలోనూ 25 ఎకరాల్లో పోలీస్ స్కూల్స్
- ప్రభుత్వ బడుల్లోనూ మార్పులు
- ప్రీ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేస్తున్నాం
- సామాజిక బాధ్యతగా ప్రయివేటు కంపెనీలు సాయమందించాలి
- చరిత్రను మలుపు తిప్పిన కొంతమంది సీఎంల నిర్ణయాలు
- ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు
- మంచిరేవులలో యంగ్ఇండియా పోలీస్‌స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- పిల్లలతో కలిసి ఆటలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని, అలాగే యంగ్ ఇండియా తన బ్రాండ్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలోని గ్రేహౌండ్ క్యాంపస్ సమీపంలోని యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. 2 కిలో బియ్యం.. ఎన్టీఆర్ బ్రాండ్ అని, హైదరాబాద్‌లో ఐటీ.. చంద్రబాబు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని, అలాగే రైతు బాంధవుడిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి బ్రాండ్ సంపాదించుకున్నారని, ఈ రోజు తాను క్రియేట్ చేసిన తన బ్రాండ్ యంగ్ ఇండియా అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ విద్యా విధానంలో ప్రాథమిక స్థాయిల్లోనే అస్పష్టత ఉన్నదని గమనించి, ఆలోచన చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విధానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేసినట్టు వివరించారు. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం ప్రజా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతలు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నా. తరగతి గదులను బలంగా నిర్మించినప్పుడే ఈ దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. ప్రజలు మాకిచ్చిన అధికారం ప్రజలకు ఉపయోగపడాలి. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలి. యంగ్ ఇండియా మా బ్రాండ్. అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలుగా పనిచేస్తుంది.

ప్రభుత్వ బేసిక్ ఎడ్యుకేషన్‌లో విధానంలోనే చిన్న అస్పష్టత ఉన్నదని నిపుణులతో ఎడ్యుకేషన్ కమిషన్ వేశాం. నిపుణులతో చర్చించాం. ప్రభుత్వ బడుల్లో ప్రీస్కూల్ విధానం ప్రవేశపెట్టాలని ఆలోచన చేశాం. ప్రైవేటు స్కూళ్లల్లో ఎలాగైతే పిల్లలకు రవాణా సౌకర్యం ఉంటుందో అదే తరహాలో నిరుపేద కుటుంబాల పిల్లలకు ఉచితంగా రవాణా సదుపాయాలు కల్పించి వారికి ఉత్తమమైన ప్లే స్కూల్ విద్యను అందించాలని నిర్ణయించాం. రాష్ట్రంలో 29 వేల ప్రభుత్వ స్కూళ్లు ఉంటే, వాటిల్లో 18.50 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. ప్రైవేటులో 11,500 స్కూళ్లు ఉంటే వాటిల్లో 30 లక్షల మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ క్వాలిఫికేషన్స్ ఉన్న వారు పని చేస్తున్నప్పటికీ విద్యార్థులు చేరడం లేదంటే మన విధానంలోనే లోపం ఎక్కడుందో ఆలోచన చేశాం.5 సంవత్సరాల వయసు ఉంటేనే ప్రభుత్వ స్కూళ్లకు పంపాలన్న నిబంధన ఉంది. అదే ప్రైవేటు స్కూళ్లల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ విధానం ఉండటంతో తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. మూడేళ్ల ప్రైవేటు స్కూళ్లల్లో చదివించి ఒకటవ తరగతికి ప్రభుత్వ స్కూళ్లకు ఎవరూ మార్చడం లేదు.

విధి నిర్వహణలో కాలం గడుపుతూ కుటుంబాలకు సమయం ఇవ్వలేక, పిల్లల చదువులపై సరైన దృష్టిని సారించలేక వారు ఎలా చదువుకుంటున్నారో తెలియక ఆందోళన పడుతున్న పోలీసు సిబ్బందికి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఒక మంచి అవకాశం. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి అధికారి వరకు కాకీ డ్రెస్ వేసుకునే ప్రతి పోలీసుకు ఈ స్కూల్ అత్యంత ప్రాముఖ్యమైనది. పోలీసు సిబ్బంది ఆలోచన, వారిలోని ఆవేదనపై నాకు ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గతంలో పాలించిన ముఖ్యమంత్రులకు ఒక్కో అంశంపై ఒక్కొక్కరు ప్రాధాన్యతగా ఒక బ్రాండ్‌ను క్రియేట్ చేసినట్టే యంగ్ ఇండియా అన్నది మా బ్రాండ్.

పెద్ద పెద్ద సంస్థల భాగస్వామ్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. YISUతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ మొదలుపెట్టుకున్నాం. మాస్టర్స్ చేయడానికి వీలు కల్పించాలన్న ఉద్దేశంతో స్కిల్స్ యూనివర్సిటీలో డిగ్రీని కూడా ప్రవేశపెట్టాం. ఆ వర్సిటీలో మొదటి బ్యాచ్‌కు నూటికి నూరు శాతం ఉద్యోగాలు వచ్చాయి.ఇదే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ విషయంలో కూడా 58 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను చేపట్టాం.

ఆర్మీ స్కూల్, సైనిక్ స్కూల్, డిఫెన్స్ అకాడమీ అంటూ రకరకాల బ్రాండింగ్‌తో గొప్ప గొప్ప స్కూళ్లు ఉన్నట్టుగానే సమాజంలో నిత్యం సేవలు అందిస్తున్న పోలీసు కుటుంబాల పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పోలీసు స్కూలును ప్రారంభించాం.పోలీసు స్కూల్‌లో చదివామన్న ఒక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకోవడానికి ఈ స్కూల్ ను తీర్చిదిద్దాలి. అందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. ముఖ్యమంత్రిగా నేను మీతో ఉంటా. నిధులు, అనుమతులు ఏం కావాలన్నా ఇబ్బంది రాదని మాట ఇస్తున్నా. కేజీ నుంచి పీజీ వరకు మీ స్కూల్‌ను మీరు తీర్చిదిద్దుకోండి.

హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న

మిగితా 2వ పేజీలో

## తెలంగాణలో త్వరలో భూకంపం..!

- ఏపీలోనూ భూకంప తీవ్రత
- ఈపీఐసీ ఎర్త్ క్వేక్ సంస్థ



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో త్వరలో భూకంపం రాబోతోందని ఈపిఐసి ఎర్త్ క్వేక్ సంస్థ అంచనా వేసింది. రాష్ట్రంలో రామగుండం సమీపంలో భూకంపం వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేసింది. దీని ప్రభావం వరంగల్, హైదరాబాద్ వరకు ఉంటుందని తమ సర్వేలో తేలిందిని పేర్కొంది. అటు ఏపీలోని అమరావతి వరకు ఈ భూకంప తీవ్రత ఉండొచ్చని అంచనా వేసింది. మహారాష్ట్ర వరకు దీని ప్రభావం ఉంటుందని స్పష్టం చేసింది. గతంలో భూకంపం వస్తుందని ఈపిఐసి ఎర్త్ క్వేక్ అంచనా వేయగా ఆ అంచనాలు కొన్నిసార్లు నిజమయ్యాయి.

ప్రపంచవ్యాప్తంగా భూకంపాలను అధ్యయనం చేసేందుకు అనేక సంస్థలు ఉన్నాయి... ఇలా భారతదేశంలో అధికారికంగా ఎన్సిఎస్ సంస్థ ఉంది. అయితే కొన్ని ప్రైవేట్ సంస్థలు కూడా భూకంపాలపై అధ్యయనం చేస్తున్నాయి. అలాంటిదే ఈ ఈపీఐసీ సంస్థ. దీన్ని శివ సీతారామ్ అనే వ్యక్తి స్థాపించాడు. తన పరిశోధన ద్వారా గ్రహించిన విషయాలను www.seismo.in వెబ్ సైట్ లో పెడతారు. ఇలా ఇప్పుడు రామగుండంలో భూకంపం సంభవించే అవకాశాలున్నాయని... అదికూడా ఏప్రిల్ 10 నుండి ఏప్రిల్ 17వ తేదీవరకు రావచ్చని ప్రకటించారు. భూకంప తీవ్రత తక్కువగానే ఉండనుంది కాబట్టి ఎలాంటి ప్రమాదం ఉండదని చెబుతున్నారు.

## తొలిరోజు 626 స్లాట్ బుకింగ్స్



- రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అమల్లోకి స్లాట్ బుకింగ్
- ప్రజలకు సులువుగా సేవలందించడమే లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు సులువుగా న్యాయమైన, వేగవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం తొలిరోజు 626 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి వచ్చినట్లుగా తెలిపారు. ఈ 22 కార్యాలయాల్లో వచ్చే ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్తామన్నారు. రెవెన్యూ విభాగంలో ఎలాంటి సంస్కరణ చేపట్టినా, ఏ విధానపరమైన నిర్ణయం తీసుకున్నా అది ప్రజల కోణంలోనే ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. తొలిరోజు స్లాట్ బుకింగ్ అమలు తీరు, ప్రజల నుంచి వచ్చిన స్పందన గురించి అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పడమే కాకుండా దళారుల ప్రమేయం కూడా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుండటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్ https://registration.telangana.gov.in/ స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆ రోజు నిర్దేశిత సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందని తెలిపారు. సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా అపాయింట్‌మెంట్ తేదీ, సమయాన్ని కూడా ముందే తెలుసుకోవచ్చని వివరించారు. నిర్దేశిత తేదీ, సమయంలో ఎలాంటి హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ పని పూర్తి చేసుకోవచ్చని వివరించారు. ఈ పారదర్శక విధానంతో మధ్యవర్తుల ప్రభావానికి తెరపడనుందని చెప్పారు.




## ప్రతి ఇంటికీ స్మార్ట్ టీవీ, ఫైబర్ కనెక్టివిటీ

- మంత్రి శ్రీధర్‌బాబు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

లోకల్ కేబుల్ ఆపరేటర్లను టీ నెక్స్ట్ లో భాగస్వామ్యం చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. టీ- ఫైబర్ నూతన కార్యాలయాన్ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా శ్రీధర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. టీ-ఫైబర్, టీ-నెక్స్ట్ లోగోను ఆవిష్కరించారు. ఆయన సంగారెడ్డి శ్రీరాంపూర్ వాసులతో మాట్లాడారు. 6 నెలల్లో ప్రతి ఇంటికీ స్మార్ట్ టీవీ, ఫైబర్ కనెక్టివిటీ అందిస్తామన్నారు. టీ- నెక్స్ట్ ద్వారా స్మార్ట్ టెలివిజన్ పరిచయం చేయబోతున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి 'టెరా' అనే చాట్ బాట్ ను ఆవిష్కరించించామని తెలియజేశారు. టీ ఫైబర్, టీ నెక్స్ట్ సేవలు ప్రజలకు తక్కువ ధరల్లో అందిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కేబుల్ అపరేటర్ల సహకారంతో లాస్ట్ మైలు వరకు టీవీ ఛానెల్స్ సదుపాయాలు కూడా కల్పిస్తామని తెలిపారు. టీవీ సెట్లను కంప్యూటర్ మానిటర్ గా వినియోగించుకుని విద్యార్థులు ప్రయోజనం పొందేలా టెక్నాలజీ రూపొందించినట్టు మంత్రి వెల్లడించారు.

'టీ - ఫైబర్ ఇప్పటికే 424 మండలాల్లోని 8,891 గ్రామ పంచాయతీలను అనుసంధానం చేసిందన్నారు. మరో 7,187 పంచాయతీలు సేవలు అందుకోవటానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం లో 30 వేల ప్రభుత్వ కార్యాలయాలకు కనెక్టివిటీ కల్పించామని, 2027 నాటికి 60 వేల కార్యాలయాలను అనుసంధానం చేస్తామన్నారు. టీ - ఫైబర్ ఇకపై తెలంగాణ నెక్స్ట్‌జెన్‌టెక్నాలజీ పేరుతో సేవలు అందిస్తుందని మంత్రి తెలిపారు. కాగా , ఈ కార్యక్రమంలో వ్యాపార భాగస్వాములతో 9 అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ సంధర్భంగా టీ ఫైబర్ కొత్త లోగోను మంత్రి శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన డేటాను సురక్షితంగా ఉంచగల సావరిన్ క్లౌడ్ ను కూడా మంత్రి ప్రారంభించారు.

## తెలంగాణ పర్యాటకంలో పెట్టుబడులు పెట్టండి..



- పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలు
- 2030 నాటికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ
- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ముంబయి పోవై లేక్‌లో దక్షిణాసియా 20వ హొటల్స్ ఇన్వెస్ట్మెంట్ కాన్ఫరెన్స్


బలగం టీవి, ముంబై

తెలంగాణ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దక్షిణాసియా ఇన్వెస్టర్ల కు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానంతో దేశంలో ఎక్కడ లేని విధంగా ఆతిథ్య రంగంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని అన్నారు. గురువారం ముంబయి పోవై లేక్‌లో జరిగిన దక్షిణాసియా 20వ హొటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ప్రఖ్యాత హొటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమై తెలంగాణ ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. పీపీపీ విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని తెలిపారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు.

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా తెలంగాణను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, హెరిటేజ్, మెడికల్, వెల్ నెస్ టూరిజాన్ని అభివృద్ధి చేసేలా నూతన పర్యాటక విధానాన్ని రూపొందించామని వివరించారు. రాష్ట్రంలో 2030 నాటికి రూ. 15 వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ, 3 లక్షల ఉద్యోగాల కల్పన, రెట్టింపు వృద్ధి, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ఆధారంగా తెలంగాణను దేశంలో మొదటి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా నిలపాలనే ఆశయంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు .

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం

- 3 గ్రూపులుగా ఉప కులాలను విభజిన
- 15 శాతం రిజర్వేషన్లు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గంలో 3 గ్రూపులుగా ఉప కులాలను విభజించి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ఈ బిల్లు రూపొందించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఈ బిల్లుకు చట్టబద్ధత ఆమోదం కోసం గవర్నర్‌కు పంపించారు. దీంతో మంగళ వారం జిష్ణుదేవ్ వర్మ ఈ బిల్లుకు ఆమోదం తెలిపారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుందని సమాచారం. ఆ తర్వాత రిజర్వేషన్లకు సంబంధించిన జీవోలు ఇవ్వనుంది.

గత నెల 17న ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా, మార్చి 18న అసెంబ్లీ ఆమోదించింది. మార్చి 19న కౌన్సిల్ ఆమోదం తెలిపిన అనంతరం ఈ బిల్లు రాజ్ భవన్‌కు పంపారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా విభజించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీటిని ఉన్నది ఉన్నట్లుగా ఎస్సీ వర్గీకరణ బిల్లులో పొందుపరిచారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం ఎస్సీ జనాభాలో వీరి వాటా 3.288 శాతం కాగా, వీరికి ఒక శాతం రిజర్వేషన్ కల్పించారు. మధ్యస్థంగా ఉన్న 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు.

## పిడుగుపాటుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వర్షం బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కూడా కురిసింది. అయితే భారీ వర్షం ధాటికి పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. రెండు వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడటంతో ఇద్దరు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లాలో ఓ కళాశాల విద్యార్థి పిడుగుపాటుకు మరణించాడు. కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన సంతోష్ కాలేజీకి వెళ్లి వస్తుండగా.. భారీ వర్షం పడటంతో చెట్టు కిందకు వెళ్లాడు. చెట్టు కింద ఉన్న సమయంలో పిడుగుపడి సంతోష్ మృతి చెందాడు. మరోవైపు నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆములూరులో చిన్న రాములు అనే వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. పొలంలో గొర్రెలు కాస్తుండగా.. పిడుగుపడటంతో రాములు మరణించాడు.



రిప్రెజెంటేటివ్ ఇమేజ్

## 24 నుంచి వేసవి సెలవులు

- తెలంగాణ విద్యాశాఖ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఏప్రిల్ 24 నుంచి విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇస్తున్నట్లు తెలంగాణ విద్యాశాఖ ప్రకటించింది. అలాగే జూన్ 12 ను విద్యాసంస్థలు పున:ప్రారంభం అవుతాయని విద్యాశాఖ తెలిపింది. వేసవి సెలవుల్లో విద్యాసంస్థలు క్లాసులు నిర్వహించకూడదని ... అలా చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. ఇంటర్ విద్యార్థులకు ఇప్పటికే పరీక్షలు ముగిసి వేసవి సెలవులు కొనసాగుతున్నాయి... వారికి కూడా వేసవి సెలవుల్లో నీట్, ఎంసెట్, జెఈఈ అంటూ క్లాసులు నిర్వహించకూడదని ఇంటర్మీడియట్ బోర్డ్ హెచ్చరించింది. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడేలా మండుటెండల వేళ క్లాసుల నిర్వహణ తగదని ... విద్యాసంస్థలు ఇందుకు సహకరించాలని సూచించారు.

# కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూవే..

- మాజీ మంత్రి హరీశ్ రావు
- సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి నివేదిక అందించిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం




**బలగం టీవీ, హైదరాబాద్**

కంచ గచ్చిబౌలి భూములు హెచ్ సియూకి చెందినవేనని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కంచె గచ్చిబౌలి భూమ లపై నివేదికను హెూటల్ తాజ్ కృష్ణలో సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం అందించింది. అనంతరం తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీశాఖ స్పందించకపోవడం వల్లే చెట్లు నరికేశారని, జంతువులు చనిపోయాయని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూములపై ఆందోళన చేసినా, అటవీశాఖ స్పందించలేదని విమర్శించారు. ఆయన తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టాలంటే ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాలని తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం అటవీశాఖ అనుమతి ఇచ్చాకే చెట్లను కొట్టాలన్నారు. వాల్టా ప్రకారం పట్టా భూమిలో చెట్లను కొట్టాలంటే అనుమతి తీసుకోవాలని చెప్పారు.సుప్రీం కోర్టు నిబంధనలు, తీర్పులను పట్టించుకోకుండా చెట్లను నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి గతేడాది నవంబర్ 22న రూ.10 వేల కోట్లు రుణం తెచ్చారని, రుణం ఇప్పించిన మధ్యవర్తికి రూ. 170 కోట్లు లంచం ఇచ్చారని ఆరోపించారు. మధ్యవర్తికి ఇచ్చిన డబ్బు గురించి సాక్షాత్తూ అసెంబ్లీలోనే చెప్పారని హరీష్ రావు అన్నారు. ఇప్పుడు ఆ భూమిని తెగనమ్మి ఇంకో 40 వేల కోట్లు తేవాలని ప్రయత్నం చేస్తుండు. నియమ నిబంధల్ని ఉల్లంఘిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎలాంటి చర్యలు, పనులు చేపట్టొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత కూడా ఇది టీజీఐఐసీకి చెందినవే అని బోర్డులు పెట్టారు. ఇది సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుంది. సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు అంటే కూడా భయం లేకుండా పోతున్నది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ హయాంలో కొత్త సెక్రటేరియెట్‌ను కట్టాలని నిర్ణయం తీసుకుంటే, పదో ఇరవయ్యో చెట్లను నరుకుతున్నారని గ్రీన్ ట్రిబ్యునల్లో ఫిర్యాదు చేశారు రేవంత్ రెడ్డి. హైకోర్టు, సుప్రీంకోర్టులో కూడా కేసు వేశారు. ఇవాళ మీరేం చేస్తున్నారు రేవంత్ రెడ్డి గారూ? వందల ఎకరాల్లో లక్షల కొద్దీ చెట్లు కొడుతున్న సీఎం గారిపై, సీఎస్ గారిపై, పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రశ్నించిన పాపానికి వారిని జైళ్లో పెట్టారు, పది రోజులుగా వాళ్లు జైల్లో ఉన్నారు. దీనికి బాధ్యత హెూం మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డిదే. వాళ్లను విడుదల చేయమని ఉప ముఖ్యమంత్రి చెబుతారు ఎందుకో మరి? ప్రభుత్వం చేయాల్సిన పనిని విద్యార్థులు చేస్తే అరెస్టు చేసి, జైల్లో పెడతారా? ప్రభుత్వం అన్ని చట్టాలనూ ఉల్లంఘిస్తున్నది. ఈ విషయాలన్నింటినీ మేం కమిటీకి నివేదించాం అని హరీశ్‌రావు తెలిపారు. డీజీపీ గారూ సీఎం గారిపై ఏ పోస్టు పెట్టినా వారిని జైల్లో పెడుతున్నారే.. మరి ఇవాళ వేలాది చెట్లు నరికినా, జింకలను చంపినా ఎందుకు కనిపించడం లేదు. జీవ విధ్వంసం మీ కళ్లకు కనిపంచడం లేదా.. ఎందుకు కేసులు పెట్టరు? నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతివారూ నేరస్తులే. అందరూ కలిసే నేరం చేశారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

ఆ భూములు హెచ్‌సీయూకే చెందాలని మేం కమిటీకి విన్నవించడం జరిగింది. మేం కొట్టిన వాటిలో కేవలం సుబాబుల్ చెట్లు మాత్రమే ఉన్నాయని అటవీ అధికారులు చెబుతున్నారు. సుబాబులే కాదు.. సుగంధ పరిమళాలిచ్చే శాండల్ వుడ్ చెట్లు కూడా ఉన్నాయి. అనేక ఔషధ మొక్కలున్నాయి. ఈ భూముల్లో చెరువు కూడా ఉన్నది. హెచ్‌సీయూ భూముల్లో చెట్ల నరికివేతతో ఏడు చట్టాలను సీఎం రేవంత్ దుర్వినియోగం చేశారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పోలీసుల అదుపులో మాజీ ఎమ్మెల్యే షకీల్

**బలగం టీవీ, హైదరాబాద్**

%బిఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎంఎల్ఎ షకీల్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నా రు. గతంలో ఆయనపై పలు కేసుల్లో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. కాగా గత కొన్ని రోజులుగా ఆయన దుబాయ్‌లో ఉంటున్నారు. తల్లి అంత్యక్రియల కోసం గురువారం హైదరాబాద్ చేరుకున్న ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంత్యక్రియల్లో పాల్గొ నేందుకు అనుమతి ఇచ్చారు.

షకీల్ కుమారుడు కూడా హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. షకీల్ కుమారుడు రాహిల్ ఆమిర్ 2022లో జూబ్లీహిల్ జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో శిశువు చనిపోయాడు. తర్వాత 2023 డిసెంబర్‌లో కూడా అలాంటి ప్రమాదం జరిగింది. ప్రజాభవన్ ముందు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీ కొట్టి వెళ్లిపోయారు.




## నా బ్రాండ్ యంగ్ ఇండియా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నో కంపెనీలకు పోలీసులు రక్షణ కల్పిస్తూనే ఉన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఆ సంస్థలు కొన్ని నిధులను అందించాల్సిన బాధ్యత ఉంది. పోలీస్ స్కూల్‌కు వంద కోట్లతో కార్పస్ ఫండ్ ఉండే విధంగా ఆలోచనలు చేయండి. అందుకు అవసరమైన సహకాన్ని ప్రభుత్వం అందిస్తుంది.తక్కువ సమయంలో మంచి క్యాంపస్‌ను తయారు చేసినందుకు అభినందనలు. పోలీసు కుటుంబాల పిల్లలు వీలైనంత మందిని ఇక్కడ చదివించుకోండి. వారికి ఇంకా మెరుగైన వసతులు ఏర్పాటు చేయడంపై ఆలోచన చేద్దాం. విద్య విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దు. మీ పిల్లల్లో స్ఫూర్తిని నింపండి" అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, లోక్‌సభ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తెలంగాణ డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, యంగ్ ఇండియా పోలీస్ అకాడమీ, స్కూల్ ఇంచార్జ్ సీవీ ఆనంద్, గ్రేహౌండ్స్ అదనపు డీజీ స్టీఫెన్ రవీంద్ర , ఇతర పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

# 23 వేల ఎకరాల్లో పంటనష్టం

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**బలగం టీవీ, హైదరాబాద్**

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 23,364 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గతనెల కురిసిన వర్షాలకు 8,408 ఎకరాల దెబ్బతిన్నట్లు నిర్ధారణ అయిందని, బాధిత రైతులకు త్వరలోనే పరిహారం అందిస్తామని తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు 14,956 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. 'గ్రామ గ్రామానికి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నాణ్యమైన విత్తనం' అనే నూతన కార్యక్రమాన్ని జూన్ తొలివారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం కింద వ్యవసాయ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను అందించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మూడు నుంచి ఐదుగురు ఆసక్తి కలిగిన అభ్యుదయ రైతులకు ఈ పథకం కింద విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

**మరో కొత్త పథకం**

వ్యవసాయ శాఖలో మరో కొత్త పథకం పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. 'గ్రామ గ్రామానికి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నాణ్యమైన విత్తనం' పథకాన్ని జూన్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులందరికి నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యమని మంత్రి అన్నారు. సుమారు 40, 000 మంది రైతులకు, 2500 నుంచి 3000 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి ముగ్గురు నుంచి ఐదుగురు ఆసక్తి కలిగిన అభ్యుదయ రైతులకు జూన్ మొదటి వారంలో ఈ పథక కింద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



## వేసవి సెలవుల్లో 'అంగన్‌వాడీ బాట' చేపట్టాలి

**హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**బలగం టీవీ, హైదరాబాద్**

వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ బాట ప్రత్యేక కార్యక్రమం చేపట్టి.. పిల్లల సంఖ్య పెంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా హిమాయత్ నగర్ సెక్టర్ నాంపల్లి ప్రాజెక్ట్‌లో గల భీమా మైదాన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టి.. కేంద్రాలకు ఎక్కువ మంది పిల్లలు వచ్చే విధంగా ప్రతి టీచర్, ఆయా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రంలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కేంద్రంలో పిల్లల హాజరు శాతం పెంచాలన్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలు ఆటల సమయంలో ఆట పరికరాలతో గడుపే విధంగా చూడాలనీ, ప్లాస్టిక్ టేబుల్స్, చైర్స్‌తో పాటు ఆట వస్తువులు అందించే దిశగా ప్రతిపాదనలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయాలకు ఇచ్చే శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే పిల్లలు యూనిఫాంతో వచ్చేలా చూడాలన్నారు. పిల్లలకు అందించే మిల్క్, బాలామృతం, గుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. కేంద్రాల ద్వారా పిల్లలతో పాటు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనీ, ఆ దిశగా సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఖాళీ స్థలంలో గార్డెన్ ఏర్పాటుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనీ, ముఖ్యంగా బయటి వారు చెత్తాచెదారం వేయకుండా వెనుక భాగంలో ఉన్న అపార్టుమెంట్ వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. పిల్లలకు ఆరోగ్య రీత్యా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తప్పక విజిట్ చేయాలని సూచించారు. కేంద్రంలో తాగునీటి వాటర్ లైన్‌ను ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. నీటి నిల్వకు సంపు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సీడీపీవో, సూపర్‌వైజర్లతో కలిసి గర్భిణీలకు నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని సారె కానుకలు, పిల్లలకు బాలామృతం తినిపించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో అక్కేశ్వరరావు, తహసిల్దార్ సంధ్యారాణి, సీడీపీవో కృష్ణ చైతన్య, సూపర్‌వైజర్ బాల, డిస్టిక్ కో–ఆర్డినేటర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

## 17న జెఇఇ మెయిన్ ఫలితాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా జెఇఇ మెయిన్ రెండో విడత ఫలితాలను ఈ నెల 17న విడుదల కానున్నాయి. జెఇఇ మెయిన్ సెషన్ -2 పేపర్- 1 పరీక్షలు మంగళవారంతో ముగియగా, పేపర్- 2 పరీక్ష బుధవారంతో ముగిసింది. మొదటి సెషన్ ఫలితాలు ఫిబ్రవరిలో విడుదల కాగా, రెండో సెషన్ ఫలితాలు ఈ నెల 17న విడుదల కానుండగా,అదే రోజు నుంచి జెఇఇ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. జెఇఇ మెయిన్ రెండు సెషన్లలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) ఆలిండియయా ర్యాంకులను ప్రకటిస్తుంది. జెఇఇ మెయిన్‌లో కనీస మార్కులు సాధించిన 2.50 లక్షల మంది మే 18న జెఇఇ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం ఉంటుంది. జెఇఇ మెయిన్ ర్యాంకులతో ఎన్ఐటిలు, అడ్వాన్స్‌డ్ ర్యాంకులతో ఐఐటీల్లో సీట్లు పొందవచ్చు. దేశంలోని 31 ఎన్ఐటిల్లో గత ఏడాది సుమారు 24 వేలు, 23 ఐఐటీల్లో 17,600, ట్రిపుల్ ఐటీల్లో దాదాపు 8,500, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే విద్యాసంస్థల్లో 57 వేల సీట్లు ఉన్నాయి. ఒకవేళ విద్యార్థులు ఐఐటీల్లో చేరాలనుకుంటే మే 18న జరిగే జెఇఇ అడ్వాన్స్‌డ్ రాయాల్సి ఉంటుంది.

## రేపు వైన్స్ బంద్

**బలగం టీవీ, హైదరాబాద్**

హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని వైన్స్‌ను శనివారం బంద్ చేయాలని పోలీస్ కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 6గంటల వరకు కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, వైన్స్ షాపులను మూసివేయాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్టార్ హెూటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లకు దీని నుంచి మినహాయింపు ఉంది. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించి షాపులను మూపివేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా బీజేపీ విధానాలు

**బలగం టీవీ, వేములవాడ**

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా బీజేపీ విధానాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో డిసిఎంస్, ఫ్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించినారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు పడించిన పంట కు మద్దతు ధర, ఉచిత విద్యుత్,మహిళా తల్లులకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. మొదటి సంవత్సరంలో రైతులకు సుమారు 50 వేల పై చిలుకు నిధులు ఖర్చు చేయడం జరిగిందని,సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 కొట్లు ఇచ్చామని అన్నారు. దేశంలో ఎక్కడ కూడా లేని సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తే, బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్నాదని ఫ్లెక్సీలు కటుడ్తున్నారని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేడం లేదని ప్రశ్నించారు.బీజేపీ పన్నుల రూపంలో ఎక్కవ తీసుకొని రాష్ట్రానికి ఏమి ఇవ్వడం లేదని, సన్న బియ్యం పై బీజేపీ చేసే రాజకీయాలు ఎవరు నమ్మొద్దని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి వాటిని ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు ఇలాంటి సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.గల్ఫ్ లో మరణించిన వారికి 5లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క పథకానికి కూడా సరియైన పాలసీ లేదని,ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక కొందరు విమర్శలు చేస్తున్నారని అన్నారు.రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా బీజేపీ వారి విధానాలు ఉన్నాయని,సన్న బియ్యం పంపిణీ చేయడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్..



**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ప్రభుత్వ విప్ కు ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు ఘన స్వాగతం పలికారు.స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు..అనంతరం ఆలయకమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ ను శలువతో ఘనంగా సత్కరించారు..

## గల్ఫ్ అడ్వైజరి కమిటీ చైర్మెన్ గా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ బీఎం వినోద్ కుమార్..

**- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

**-కమిటి గౌరవ సభ్యులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియామకం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల కోసం ఎన్నారై పాలసీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం,వారి సమస్యలపై అధ్యయనం చేయవలసిందిగా అడ్వైజరీ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసిందిఅడ్వైజరీ కమిటీ చైర్మన్ గా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ బీఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ గ మంద భీమ్ రెడ్డిలను,సభ్యులుగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, టీజీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ తో పాటు 7గురు సభ్యులతో కూడిన కమిటీ ని నియమిస్తూ సి ఎస్ శాంత కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ అడ్వైజరీ కమిటీ రెండు సంవత్సరాల పాటు ఉండునట్లు పేర్కొన్నారు.

# మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత...

**-ఎస్పీ మహేష్ బి గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణ పరిధిలోని అపెరల్ పార్క్ లో శుక్రవారం టెక్స్ పోర్ట్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నలుగురు మంత్రుల రాక సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. గురువారంజిల్లాలో మంత్రుల పర్యటన సందర్భంగా తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతోఎస్పీ మహేష్ బి గితే సమావేశం నిర్వహించినారు.ఈ సందర్భంగా ఎస్పి మహేష్ బి గితే మాట్లాడుతూ అపెరల్ పార్క్ లో టెక్స్ పోర్ట్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్తమనికి మంత్రుల రాక సందర్భంగా సుమారు 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.యూనిట్ ప్రారంభోత్సవ ప్రాంగణంలో,విఐపి గ్యాలరిలో,సభ ప్రాంగణంలో, వివిఐపి, జనరల్ పార్కింగ్ ప్రదేశలలో బందోబస్తులో ఉన్న అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, సిఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సదన్ కుమార్, మధుకర్, నాగేశ్వరరావు, ఆర్.ఐలు రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

## స్పెషల్ వాక్సినేషన్ కంపెయిన్ టీకాలు



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషల్ ఇమినైజేషన్ కంపెయిన్ పై మండల వైద్య అధికారులతో సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండలం వైద్య అధికారి డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ: ఐదు సంవత్సరాలు లోపు పిల్లలలో వ్యాధి నిరోధక టీకాలు మిస్సయిన పిల్లలకు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన, ఇటుక బట్టిలలో ఉన్న పిల్లలు, వివిధ కారణాల చేత టీకాలు వేయంచని పిల్లలందరికి ఏప్రిల్ నెలలో 21 నుండి 28 వరకు, మే నెలలో 21 నుండి 28 వరకు, జూన్ నెలలో 23 నుండి 30 వరకు స్పెషల్ వాక్సినేషన్ కంపెయిన్ కార్యక్రమంలో టీకాలు వేస్తామని అన్నారు. ఈ సమావేశంలో బోయినిపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ వినోద్, మండల తహశీల్దార్ నారాయణ రెడ్డి, మండల అభివృద్ధి అధికారిని జయశీల, డా. విన్నుతన, డా. శిరీష, మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ శశి కుమార్, హేమలత అంగన్వాడి, సూపర్వైజర్ నిర్మల పాల్గొన్నారు.



## నేడు డయల్ యువర్ డీఎం

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న జిల్లా లోని ప్రయాణికుల నుంచి సలహాలు సూచనల కోసం శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల డీఎం ప్రకాష్ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడి తమ సమస్యలు, ఫిర్యాదులు తెలపవచ్చని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో 9959225929 నెంబర్ కు ఫోన్ చేయాలని కోరారు.



## గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం.

**బలగం టీవీ, వేములవాడ**

గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి అన్నారు. వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో సుమారు 5 లక్షల నిధుల సీసీ రోడ్డు కి బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని గడపగడపకు సిసి రోడ్డు వేసి గ్రామాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి బండి సంజయ్ కృత నిశ్చయంతో ఉన్నారని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో గ్రామాలను అభివృద్ధి పరచడానికి బిజెపి సిద్ధంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెట్టిపల్లి రవికిషోర్, మండల ప్రధాన కార్యదర్శి గోపు ప్రవీణ్, భూత్ అధ్యక్షులు కంకణల రాజు, మండల నాయకులు సండే సారి మల్లికార్జున్,మండల కార్యవర్గ సభ్యులు వినోద్ గౌతమ్ బిజెపి సీనియర్ నాయకులు ఆకుల బాబు తోట శేఖర్ మల్లారం తిరుపతి ఉప సర్పంచ్ అవునూరి తిరుపతి నరేష్ గ్రామస్తులు పాల్గొన్నారు



## శ్రీ సీతారామచంద్రస్వామి రథోత్సవం..

**బలగం టీవీ, సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దాచారం గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం మూడు గంటల నుండి పూజా కార్యక్రమాలు నిర్వహించి 6:00 గంటలకు రథోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రథాన్ని భక్తిశ్రద్ధలతోటి గ్రామ ప్రజలు తాడు లాగుతూ మహిళలు మంగళ హారతులు ఇస్తూ స్వామివారిని గ్రామం చుట్టూ తిప్పడం జరుగుతుంది. సుమారు 6 గంటల పాటు రథోత్సవం భారీ సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించడం జరుగుతుంది. తదుపరి హెూమం జరిపి సాయంత్రం వేళలో నాగవెల్లి, సకల దేవతల ఉద్వాసన, చక్ర తీర్థ స్నానం కార్యక్రమాలతో స్వామివారి ఉత్సవాలు ఘనంగా జరుపబతున్నాయి.



## తాగునీటి ఎద్దడి నివారణకు బోరు ఏర్పాటు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ ప్రజల త్రాగునీటి ఎద్దడి నివారణ కొరకై కేంద్ర హెూంశాఖ సహాయ మాత్యులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సహకారంతో గ్రామ బస్టాండ్ పరిధిలోని హనుమాన్ ఆలయం వద్ద బోరు వేయడం జరిగింది. బీజేపీ నాయకులు, హనుమాన్ భక్తులు, గ్రామ ప్రజలు మంత్రి సంజయ్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ ఆగేదేలే..

- వరుసగా నాలుగో విజయం
- చిన్నస్వామిలో రాయల్ ఛాలెంజర్స్‌పై గెలుపు
- చితక్కొట్టిన కేఎల్ రాహుల్




**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగుతోంది. వరుసగా నాలుగో విజయం సాధించింది. చిన్నస్వామిలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్(93 నాటౌట్) అర్ధ శతకంతో విజృంభించాడు. నాలుగు మ్యాచ్ ల్లో వరుసగా గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది.

తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. మొదట కేవలం 4 ఓవర్లలోఆర్సీబీ 62 పరుగులు చేసి ఒక వికెట్ మాత్రమే కోల్పోయింది. దురదృష్టవశాత్తు గొప్ప ఫామ్ లో ఉన్న ఫిల్ సాల్ట్ రనౌట్ అయ్యాడు. 17 బంతుల్లో 37 పరుగులు చేసిన తర్వాత నిష్క్రమించాల్సి వచ్చింది. ఆర్సీబీ ఓపెనర్లు ఫిల్ సాల్ట్(37), విరాట్ కోహ్లీ(22) దూకుడుగా ఆడారు. రజత్ పాటిదార్ 25, కృనాల్ పాండ్యా 18 పరుగులు చేశారు. చివర్లో టిమ్ డేవిడ్ 20 బంతుల్లో 37 పరుగులు చేశాడు. టిమ్ డేవిడ్ 2 ఫోర్లు, 4 సిక్సులతో మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీకి ఓ గౌరవప్రదమైన స్కోరును సాధించగలిగింది. ఢిల్లీ బౌలర్లలో విప్రజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. ముకేశ్ కుమార్, మోహిత్ శర్మ చెరో వికెట్ తీశారు.

అనంతరం 164 పరుగుల లక్ష్యంతో బరిలోకి ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 4 వికెట్లు కోల్పోయి 17.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఢిల్లీ బ్యాటర్లు కేఎల్ రాహుల్(93లి, 53 బంతుల్లో 7 ఫోర్లుస 6 సిక్సులు), స్టబ్స్(38లి, 23 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) అద్భుతంగా రాణించారు. ఆ జట్టు కేవలం 58 పరుగుల స్కోరు వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది. కానీ ఆ తర్వాత కేఎల్ రాహుల్, ట్రిస్టన్ స్టబ్ జోరు కొనసాగించడంతో బెంగళూరుకు ఓటమి తప్పలేదు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 2 వికెట్లు పడగొట్టగా.. యశ్ దయాల్, సుయాష్ శర్మ తలో వికెట్ తీశారు.




# చెన్నై కెప్టెన్‌గా ధోనీ

## గాయంతో ఐపీఎల్ నుంచి రుతురాజ్ ఔట్

**బలగం టీవి, హైదరాబాద్**

వరుస ఓటములతో సతమతమవుతున్న సీఎస్‌కేలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మోచేయి గాయం కారణంగా మెగా టోర్నీ నుంచి నిష్క్రమించాడు. దాంతో సీఎస్‌కే బాధ్యతలు మళ్లీ ధోనీ చేతుల్లోకే వెళ్లాయి. ఈ విషయాన్ని చెన్నై కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ తాజాగా ధ్రువీకరించారు. “మోచేయి ఫ్రాక్చర్ కారణంగా రుతురాజ్ గైక్వాడ్ ఈ సీజన్‌కు దూరమయ్యాడు. ఇకపై చెన్నై కెప్టెన్‌గా ధోనీ ఉంటాడు” అని ఫ్లెమింగ్ పేర్కొన్నాడు. ఈ మేరకు సీఎస్‌కే కూడా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. జోఫ్రా ఆర్చర్ వేసిన ఓవర్‌లో ఓ షార్ట్ బాల్ కారణంగా గైక్వాడ్ చేతికి గాయమైన విషయం తెలిసిందే.

రుతురాజ్ రాజస్థాన్ రాయల్స్‌లో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా బంతి అతడి ఎడమ మోచేతికి బలంగా తాకింది. దాంతో, ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌తో గైక్వాడ్ ఆడడం సందేహం అనిపించింది. ఆ మ్యాచ్‌కు ధోనీ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడనే వార్తలు వినిపించాయి. కానీ, గైక్వాడ్ జట్టుతో కలిసి మైదానంలోకి దిగాడు. అయితే.. ఢిల్లీపై స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. మోచేతి నొప్పిగా ఉండడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా అతడి మోచేతి ఎముకలో చిన్న పగుళ్లను గుర్తించారు. విశ్రాంతి అవసరమని సూచించారు డాక్టర్లు. దాంతో, గైక్వాడ్ సీజన్ మొత్తానికి దూరం అవ్వాల్సి వచ్చింది.

ఇక నేడు కోల్‌కతాతో జరగనున్న మ్యాచ్ నుంచి ధోనీ చెన్నైకి సారథిగా బరిలో నిలవనున్నాడు. మహీ సారథ్యంలో సీఎస్‌కే ఇప్పటికే ఐదు సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటివరకూ చెన్నై ఐదు మ్యాచులు ఆడగా ఏకంగా నాలుగింట్లో ఓటమి చవి చూసింది. పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది.

# 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్

- పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు
- పాల్గొననున్న ఆరు జట్లు

**బలగం టీవి, హైదరాబాద్**

2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే విశ్వ క్రీడల్లో 128 ఏళ్ల తర్వాత క్రికెట్ నిర్వహించనున్నారు. అయితే ఈ క్రికెట్ పోటీల్లో ఆరు జట్లు పాల్గొంటాయని తాజాగా నిర్వాహాకులు నిర్ణయించారు. ఆతిథ్య దేశమైన అమెరికా నేరుగా పాల్గొనే అవకాశం ఉండగా మిగతా జట్ల ఎంపిక కోసం నిర్వాహకులు కసరత్తు జరుగుతున్నట్టు తెలుస్తోంది. టీ20 ఫార్మాట్‌లో పోటీలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో పురుషలు, మహిళల విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు.




పురుషుల విభాగంలో ప్రస్తుత టీ20 ర్యాంకింగ్స్, ప్రపంచ క్రికెట్‌లోని బలమైన జట్ల ఆధారంగా చూసుకుంటే ఈ జట్లు ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కనిపిస్తోంది. టీ20 ప్రపంచ చాంఫియన్స్ ర్యాంకిం గ్‌లో ఇండియా ఎప్పుడూ టాప్‌లోనే ఉంటుంది. కాబట్టి ఒలింపిక్స్‌కు ఎంపిక అయ్యే అవకాశం ఎక్కువగానే ఉంది. తర్వాత ఆస్ట్రేలియా ఇది కూడా టీ20 ఫార్మట్‌లో బలమైనే జట్టనే చెప్పవచ్చు. గతంలో ఈ జట్టు విజేతగా కూడా నిలిచింది. దీంతో పాటు టీ20 అగ్ర జట్లలో ప్రపంచ కప్ విజేతలుగా ఉన్న ఇంగ్లాండ్‌కు కూడా చోటు దక్కే అవకాశం ఉంది. వీటితో పాటు టీ20లో స్థిరమైన ప్రదర్శనతో బలమైన ఆటగాళ్లుగా ఉన్న న్యూజిలాండ్, టీ20 ఫార్మాట్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌లుగా నిలిచిన వెస్టిండీస్, టీ20 ర్యాంకింగ్‌లలో తరచూ టాప్ 5–6 స్థానాల్లో ఉండే దక్షిణాఫ్రికాకు చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మహిళల టీ20లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌లు నిలిచిన ఆస్ట్రేలియా ఈజీగా ఒలిపింక్స్‌లో ప్లేస్ సంపాధించుకునే అవకాశం ఉంది. దీంతో పాటు ప్రస్తుత మహిళల టీ20 ప్రపంచ చాంపియన్‌లుగా ఉన్న న్యూజిలాండ్, గతంలో ప్రపంచ కప్ విజేతలు అయిన ఇంగ్లండ్, ఆసియా గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన భారత్‌కు ఛాన్స్ దక్కే అవకాశం కనిపిస్తోంది, మహిళల టీ20 ర్యాంకింగ్‌లలో తరచూ టాప్–5లో ఉండే దక్షిణాఫ్రికా, 2016 టీ20 ప్రపంచ కప్ విజేతలు నిలిచిన వెస్టిండీస్ జట్లకు ఒలింపిక్స్‌లో చోటు లభించే అవకాశం ఉంది. లాస్ ఏంజిల్స్‌లో జరిగే క్రీడల్లో కొత్తగా అయిదు ఆటలకు అవకాశం కల్పించారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోసీ, స్క్వాష్‌లకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే వేదికలను ఇంకా కన్ఫర్మ్ చేయలేదు. ఒలింపిక్స్ సమీపిస్తున్న సమయంలో షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు చెప్పారు.

# రేపు ‘విశ్వంభర’ నుంచి ఫస్ట్ సింగిల్

**బలగం టీవి, హైదరాబాద్**

చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియన్ మూవీ విశ్వంభర. తాజాగా ఈ సినిమా నుంచి కీలక అప్‌డేట్‌ను వెల్లడించారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఏప్రిల్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రామ రామ అంటూ ఈ ఫస్ట్ సింగిల్ రాబోతుండగా.. ఈ సందర్భంగా బాల హనుమాన్‌లతో చిరంజీవి ఉన్న కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బింబిసార’ ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు.




# ‘ఫూలే’ సినిమా విడుదల వాయిదా



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ సామాజిక తత్వవేత్త, మహిళల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మహాత్మా జ్యోతి రావు పూలే (1827–1890) అతడి భార్య సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రల ఆధారంగా బాలీవుడ్‌లో పూలే అనే టైటిల్‌తో సినిమా శుక్రవారం(నేడు) విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ మూవీకి బ్రాహ్మణ సమాజం నుంచి వ్యతిరేకత రావడంతో మూవీ విడుదలను వాయిదా వేశారు మేకర్స్. అనంత్ నారాయణ్ మహాదేవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. జీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రణయ్ చోక్షి, జగదీష్ పటేల్, రితేష్ కుదేచా, అనుయా చౌహాన్ కుదేచా, సునీల్ జైన్ తదితరులు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పూలే పాత్రలో గుజరాతీ నటుడు ప్రతీక్ గాంధీ నటిస్తున్నాడు. అతడి భార్య సావిత్రి బాయి పూలే పాత్రలో బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు భార్య పత్రలేఖ నటిస్తుంది.

ఈ సినిమా బ్రాహ్మణ సమాజాన్ని తప్పుగా చూపిస్తుందని.. కులవాదాన్ని ప్రోత్సహిస్తుందని బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆనంద్ దవేతో పాటు పలు బ్రాహ్మణ సంఘాలు ఆరోపించాయి. ఇదే కాకుండా సెన్సార్ బోర్డు కూడా కుల సంబంధిత పదాలను తొలగించాలని సూచించింది. అయితే ఈ చిత్ర దర్శకుడుఈ ఆరోపణలను ఖండిస్తూ, సినిమా చారిత్రక వాస్తవాల ఆధారంగా రూపొందిందని, ఎటువంటి అజెండా లేదని వెల్లడించారు.

# ఆంజనేయస్వామి కృపతో మార్క్ శంకర్ ఇంటికి వచ్చేశాడు: చిరంజీవి

**బలగం టీవి, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ ఇంటికి చేరుకున్నాడని మెగాస్టార్ చిరంజీవి ‘ఎక్స్’ వేదికగా తెలియజేశారు. “మా బిడ్డ మార్క్ శంకర్ ఇంటికి వచ్చేశాడు. అయితే, ఇంకా కోలుకోవాల్సి ఉంది” అని ఆయన పేర్కొన్నారు. తమ కులదైవమైన ఆంజనేయస్వామి దయ, కృపతో మార్క్ శంకర్ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో మునుపటిలా ఉంటాడని ఆకాంక్షించారు. రేపు హనుమాన్ జయంతి అని చిరంజీవి గుర్తు చేశారు. ఆ స్వామి తమ పసిబిడ్డను ఒక పెద్ద ప్రమాదం నుంచి, విషాదం నుంచి కాపాడి తమకు అండగా నిలిచారని ఆయన అన్నారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో, తమ తమ ప్రాంతాల్లో ఆ బిడ్డ కోసం ప్రార్థనలు చేసి, ఆశీస్సులు అందజేస్తూ తమకు అండగా నిలుస్తున్నారని రాసుకొచ్చారు. వారందరికీ తన తరపున, పవన్ కల్యాణ్ తరపున, తమ కుటుంబం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.